# కందిలి

www.kandilinews.com

న్యూస్.. దారిచూపే దీప శిఖ

శుక్రవారం | 26.12.2025   సంపుటి: 01 | సంచిక: 145 | వెల: రూ. 4 /-   TGTEL/25/A 1800





మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.

ఇట్లు.. టీం కందిలి





# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా..
# సందేశాన్ని మోసుకొచ్చిన
# సూర్యాపేట "శాంటా క్లాజ్"

- మత్తు పదార్థాలకు బానిసలుగా మారొద్దని మెదక్ చర్చి వద్ద క్రిస్మస్ పండగ రోజు అవగాహన
- ఆల్కహాల్, డ్రగ్స్, పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రచారం
- నోటి క్యాన్సర్ తో తన మిత్రుడిని కోల్పోయిన తర్వాత మరెవరికీ ఈ పరిస్థితి రావద్దనే ఆలోచనతో అవగాహన కార్యక్రమాలు మొదలు
- నేటి యువతలో చైతన్యం కల్పించేలా కృషి చేస్తున్న టీచర్ రాచకొండ ప్రభాకర్
- అభినందించిన మెదక్ ఎస్పీ డివి శ్రీనివాసరావు

**కందిలి, మెదక్**

నోటి క్యాన్సర్ తో తన ప్రాణ స్నేహితుడిని కోల్పోవడం అతడిని తీవ్రంగా కలిచి వేసింది. తన మిత్రుడి అకాల మరణానికి కారణమైన పొగాకు ఉత్పత్తులను నేటితరం వాడకుండా చూడాలని, డ్రగ్స్, ఆల్కహాల్ బారిన పడకుండా అవగాహన పెంచాలని నిర్ణయించుకున్నాడు. గత కొన్నేళ్లుగా రద్దీగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తున్నాడు సూర్యాపేట జిల్లా గోరంట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న తెలుగు టీచర్ రాచకొండ ప్రభాకర్. క్రిస్మస్ పండుగ సందర్భంగా మెదక్ చర్చి వద్దకు వచ్చి ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రయత్నించాడు. డ్రగ్స్ రహిత సమాజమే తన లక్ష్యమనే సందేశాన్ని ఈ సూర్యాపేట శాంటా క్లాజ్ మోసుకొచ్చాడు.

**కొన్నేళ్లుగా..**
**అవగాహన కార్యక్రమాలు!**

రాచకొండ ప్రభాకర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. డ్రగ్స్,ఆల్కహాల్, పొగాకు వినియోగం వల్ల ఎన్నో దుష్పరిణామాలు తలెత్తుతాయంటూ ఆయన ప్రచారం చేస్తున్నారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ యాత్ర కూడా చేపట్టారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ గంజాయి విచ్చలవిడిగా లభిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువత వీటికి బానిసలుగా మారుతున్నారని, ఉన్నత భవిష్యత్తును చేజేతులా పాడు చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే తన బాధ్యతగా భావించి ఈ అంశంపై విస్తృతంగా అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని స్పష్టం చేస్తున్నారు.

**అభినందించిన...**
**మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు!**

మెదక్ చర్చి వద్ద క్రిస్మస్ పర్వదినాన అవగాహన కల్పిస్తున్న రాచకొండ ప్రభాకర్ ను చూసి, మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆయన వద్దకు వచ్చారు. శాంటా క్లాజ్ వేషధారణలో, చేతిలో మైక్ పట్టుకొని, డ్రగ్స్ వాడొద్దు.. జీవితాలు నాశనం చేసుకోవద్దు అంటూ అవగాహన కల్పిస్తున్న రాచకొండ ప్రభాకర్ ను ఎస్పీ అభినందించారు. సమాజ హితం కోసం పనిచేయడం గొప్ప విషయమని ఆయనను ప్రోత్సహించారు







## మెదక్ చర్చిలో...
## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మెదక్ చర్చిలో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రేమ, కరుణ, క్షమాగుణమనే సందేశాలను అందించిన యేసు ప్రభువును ఆరాధించారు. **కందిలి, మెదక్**







# క్రిస్మస్ పర్వదినోత్సవాన

## సంగారెడ్డి చర్చిలలో నిర్వహించిన వేడుకల్లో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**కందిలి, సంగారెడ్డి**

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలోని చర్చిలలో నిర్వహించిన వేడుకల్లో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఆసుపత్రి సిబ్బంది, పేషంట్ల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంగారెడ్డిలోని మెథడిస్ట్ చర్చ్, సీఎస్ఐ చర్చ్, రాక్ చర్చ్, హోసన్న చర్చ్, సౌందర్య సీయోను చర్చిలలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మత పెద్దలు, పాస్టర్లతో కలసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. చర్చి పెద్దలు నిర్మలా జగ్గారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సౌహార్ద్రతకు ప్రతీక అయిన క్రిస్మస్ పండుగను ప్రతి ఒక్కరూ ఐక్యతతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ , కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ జార్జ్, క్రిస్టియన్ కోఆర్డినేటర్ మధు, నాయకులు కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## జేపీ కాలనీలో... ఘనంగా క్రిస్మస్ వేడుకలు!

- కేక్ కట్ చేసిన ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి

**కందిలి, పటాన్ చెరు:** పటాన్ చెరు పరిధిలోని జేపీ కాలనీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. చిన్నారులకు కేక్, చాక్లెట్లు పంపిణీ చేశారు. అందరినీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, టీపీసీసీ మాజీ కార్యదర్శి మతీన్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు జ్యోతి ప్రవీణ, లక్ష్మీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.




## క్రిస్మస్ వేడుకల్లో... బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

- సంగారెడ్డి పట్టణంలోని ఎఫ్ఏసీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

**కందిలి, సంగారెడ్డి:** సంగారెడ్డి పట్టణంలోనిఎఫ్ఏసీ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. చర్చి పాస్టర్ జి. దేవదానం ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సంఘం నాయకులు మేఫి, జీవరత్నం, లాజర్ ప్రభాకర్, ఐజాక్, జోసెఫ్ ఎలీషా, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోకుల్ కృష్ణ, నాగరాణి, బీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ శ్రీధర్, మీడియా ప్రతినిధి అమిదిపురం మహేష్ కుమార్ మహేంద్ర, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సుధాకర్, దేవదాస్, నాయకులు రమేష్, సురేష్, భిక్షపతి, ఆంజనేయులు, మహిళా విభాగం అధ్యక్షురాలు మంజుల, అధికార ప్రతినిధి మంగ గౌడ్, మానస, వీరమణి, నిర్మల పాల్గొన్నారు.



## యేసుక్రీస్తు బోధనలు ఆదర్శనీయం!

- మానవాళికి క్రీస్తు శాంతి సందేశం స్ఫూర్తిదాయకం
- క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్

**కందిలి, పటాన్ చెరు**

శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆదర్శనీయం, అనుసరణీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చిట్కుల్ పరిధిలోని బ్యూలా, ఎంవీ చర్చిలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవుడిగా ప్రజల మధ్యనే నడయాడి సమాజానికి



శాంతి సందేశం అందించిన దయామయుడు యేసుక్రీస్తు అని కొనియాడారు. క్రీస్తు చూపిన శాంతి మార్గం సర్వ మానవాళికి స్ఫూర్తి దాయకమని, ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ ప్రతి ఒక్కరూ ప్రేమ, జాలి, దయా గుణాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో బ్యూలా చర్చి నిర్వాహకులు ప్రకాష్ రావు, రాజ్యలక్ష్మి, ఎంవీ చర్చి నిర్వాహకులు శ్రీమాన్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకులు రవి, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ నారాయణ రెడ్డి, రజక సంఘం రాష్ట్ర నాయకులు సీహెచ్ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు గోపాల్, రాజ్ కుమార్, గౌరి శంకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డిని.. కొరడా దెబ్బలు కొట్టినా తక్కువే!

- చిల్లర మాటలు మాని పెండింగ్ బిల్లులు విడుదల చేయండి!
- అయిదు నెలల నుంచి విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు రాలేదు
- నాసర్ పురలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు

**కందిలి, సంగారెడ్డి**



సిద్ధిపేట పట్టణంలోని నాసర్ పుర ఫిల్టర్ బెడ్ వద్ద ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో మాజీ మంత్రి హరీశ్ రావు గురువారం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్లు, బియ్యాన్ని పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు.

**విద్యార్థులను..కనీసం పట్టించుకోవడం లేదు!**

"అయిదు నెలల నుంచి విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు రావడం లేదు. మెస్ బిల్లులు అయిదు నెలలుగా రావడం అందలేదు. రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ మంత్రి ఉన్నా, అనాథ పిల్లలకు అన్నం పెట్టడం లేదు. కమిషన్లు కొట్టుడు, చిల్లర మాటలు మాట్లాడడం, పార్టీలు మారడం, సీట్లు కొనడం రేవంత్ రెడ్డికి అలవాటు. చిల్లర మాటలు మాని పెండింగులో ఉన్న బిల్లులు విడుదల చేయాల"ని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

**కొరడాతో కొట్టినా..తప్పలేదు!**

"తెలంగాణ తెచ్చిన పోరాట యోధుడు కేసీఆర్. కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదు. రాష్ట్ర సాధకుడు కేసీఆర్ గురించి రేవంత్ రెడ్డి వీధి రౌడీలాగా మాట్లాడుతున్నారు. తండ్రిలాంటి కేసీఆర్ గురించి అలా మాట్లాడటం సరికాదు. గ్రీన్ ఛానెల్ ద్వారా డబ్బులు ఇస్తామని, ఇవ్వడం లేదు. 20 శాతం కమిషన్ ఇచ్చే వాళ్లకే డబ్బులు విడుదల చేస్తున్నారు. కమిషన్ ఇవ్వని వారికి ఇవ్వడం లేదు. రేవంత్ రెడ్డిని చెట్టుకు కట్టేసి కొరడా దెబ్బలు కొట్టినా తక్కువే"అంటూ హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు.



# మైత్రి మైదానం వేదికగా..

## ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్!

- జనవరి 4న నిర్వహించేందుకు చకచకా ఏర్పాట్లు
- వెల్లడించిన పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**కందిలి, పటాన్ చెరు**

పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా జనవరి 4వ తేదీన జీఎంఆర్ ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో పోటీలకు సంబంధించిన బ్రోచరును ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం యువతను ప్రోత్సహించేలా ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిలో వ్యాయామంపై ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. యువత పెడదారి పట్టకుండా క్రీడలపైన ఆసక్తి పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పటాన్ చెరు నియోజకవర్గంలో మొట్టమొదటిసారి జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనబోతున్నారన్నారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సదవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఉపేందర్, లియాఖత్, పృథ్వీరాజ్, శివారెడ్డి, వెంకటేష్, నిర్వాహకులు షకీల్, ఒమర్ తదితరులు పాల్గొన్నారు.



# కబడ్డీ జట్లకు.. జెర్సీల పంపిణీ!

క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ఎల్లప్పుడు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరగనున్న 72వ సీనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న సంగారెడ్డి జిల్లా పురుషుల, మహిళల జట్టుకు రూ.30 వేల సొంత నిధులతో కొనుగోలు చేసిన జెర్సీలను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గురువారం అందజేశారు. **కందిలి, పటాన్ చెరు**



# వాజ్ పేయికి... ఘన నివాళి!

భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ జయంతి ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయీ చిత్రపటానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిగా పని చేసిన సమయంలో ప్రపంచంలోనే గొప్ప నాయకుడిగా వాజ్ పేయీ పేరు తెచ్చుకున్నారన్నారు. వాజ్‌పేయీ ఆశయాలను నరేంద్ర మోదీ అమలు చేస్తున్నారని వివరించారు. భవిష్యత్తు తరాలకు వాజ్‌పేయీ చరిత్ర తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. **కందిలి, సంగారెడ్డి**



# వాజ్ పేయీ దేశానికి చేసిన సేవలు మరువలేనివి!

- **జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన బీజేపీ పట్టణ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్**

**కందిలి, సిద్దిపేట:** భారత దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ అన్నారు. గురువారం వాజ్ పేయి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కాంచిట్ చౌరస్తా వద్ద పార్టీ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. దేశం కోసం, ధర్మం కోసం జీవించిన మహా వ్యక్తి వాజ్ పేయి అని కీర్తించారు. ప్రతిపక్ష నేతగా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా, ప్రధానిగా అటల్ బిహారీ వాజ్‌పేయి అందించిన సేవలు ఎన్నటికీ మరిచి పోలేమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కాసానిగొట్టు సంతోష్, గుండ్ల జనార్ధన్, తోడుపునూరి వెంకటేశం, కెమ్మసారం సంతోష్, భోగి శ్రీనివాస్, బొడ్డు సునీల్, దాబ నరేష్, చెంది సత్యనారాయణ, కనకరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన సర్పంచుకు.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సత్కారం!

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎర్దనూరు గ్రామ సర్పంచుగా పంబల జ్యోతి దుర్గా ప్రసాద్ ఎన్నికయ్యారు. సంగారెడ్డికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య వారిని ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలియజేశారు.

కందిలి, సంగారెడ్డి



## క్రిస్మస్ వేడుకల్లో.. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మెథడిస్టు చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మత పెద్దలు, పాస్టర్లతో కలసి క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్రిస్మస్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలు స్మరించుకుంటూ.. శాంతి, ప్రేమ, సోదర భావం సందేశాన్ని ఎమ్మెల్యే తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి పండుగలను జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రపంచం మొత్తం క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటుందని గుర్తు చేశారు. క్రీస్తు బోధనలు, ఆచరించిన విధానం మనకు ఎంతో ఉపయోగమన్నారు. ఆ దేవుడి కృప అందరిపై ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ ఛైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, చింతా సాయినాథ్, జీవి శ్రీనివాస్, విష్ణు, అశ్విన్,రామప్ప, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

కందిలి, సంగారెడ్డి



## క్రిస్మస్ వేడుకల్లో... మాదిరి ప్రిథ్వీరాజ్!

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వివిధ చర్చిలను ఎండీఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ సందర్శించారు. ఆయా చోట్ల ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు, సమృద్ధిగా కలగాలని దైవ కృప కోరారు. చర్చిలలో స్వయంగా పాస్టర్లకు కేకులు అందజేసి, కేక్ కట్ చేసి క్రిస్మస్ గ్రీటింగ్స్ తెలియజేశారు. క్రిస్మస్ క్యాలెండర్లను ఆవిష్కరించారు.

కందిలి, పటాన్ చెరు





# చిన్నారులతో కలిసి.. క్రిస్మస్ సంబరం!

సిద్దిపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అందరికీ క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమభావాన్ని, సేవాతత్పరతను , క్షమాగుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజన్నారు.

కందిలి, సిద్దిపేట

Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com